నేటి నుంచి సభాపర్వం

- కృష్ణ, గోదావరి జలాలే ఎజెండాగా అసెంబ్లీ
- సభకు రానున్న బిఆర్ఎస్ అధినేత కెసిఆర్
- ఢీకొనేందుకు సిఎం రేవంత్ రెడ్డి
- విబి జి ఆర్ఎంఎ జి, ఎస్ ఐఆర్ వ్యతిరేకంగా తీర్మానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ నేతల విమర్శలు,ప్రతి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాష్ట్రంలో బయట రాజకీయ వాతావరణం ఒక్కసారిగా హీటెక్కిన నేపథ్యంలో... సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు గులాబీ పార్టీ అధినేత కెసిఆర్ రానుండటంతో సభ లోపలి వాతావరణం కూడా మరింత వేడెక్కనుంది. శాసనసభకు హాజరయ్యేందుకు వీలుగా ఆయన ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్ నుంచి ఆదివారం నాటికే హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ నీటి వాటాలపై ఇరు పక్షాల నేతలు పరస్పరం నిప్పులు చెరుగుతున్నారని స్పష్టంగా కనబడుతోంది. ఈ మేరకు అధికార, ప్రధాన ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న శాసనసభ, శాసనమండలి సమావేశాల నిర్వహణకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వాటిపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీని ఎన్ని రోజులు నడపాలనే దానిపై సోమవారం నిర్వహించబోయే సభా వ్యవహారాల సంఘం (బిఎసి) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అయితే మంగళ, బుధవారాలు అసెంబ్లీకి సెలవులిచ్చి, నూతన సంవత్సరం ప్రారంభం రోజైన బుధవారం ఉభయ సభలను పునఃప్రారంభించాలని భావిస్తున్నారు. స్పీకర్ నిర్ణయానుసారం ఉభయ సభలను నిర్వహించనున్నట్టు సమాచారం.

ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో తమదే పై చేయంటూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పరస్పరం ప్రకటనలు గుప్పించాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో 'పొలిటికల్ హీట్' మొదలైంది. మాజీ సిఎం కెసిఆర్.. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన వ్యాఖ్యలతో మరింత హీటెక్కింది. ప్రతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్లు, కౌంటర్‌గా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అగ్గికి ఆజ్యం పోశాయి. దీంతో గత పది రోజుల నుంచి కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య తిట్లు, శాపనార్థాలు, బూతు పురాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సోమవారం నుంచి అసెంబ్లీ ప్రారంభం కాబోతోన్న నేపథ్యంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాలపై గత బిఆర్ఎస్ హయాంలో చేసుకున్న ఒప్పందాలు, ఆ సందర్భంగా ఆనాటి సిఎం కెసిఆర్ చేసిన సంతకాలను సభలో అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో వివరించటం ద్వారా ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డిపిఆర్‌ను కేంద్రం తిప్పి పంపిన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదంటూ చెప్పడం ద్వారా అధికార పక్షాన్ని డైలమాలో పడేయాలన్నది బిఆర్ఎస్ వ్యూహంగా కనబడుతోంది.

ఈ రకంగా ఆ రెండు ప్రధాన పార్టీలు.. నీళ్లే అజెండాగా, ఒకరిపై మరొకరు పై చేయి సాధించుకోవటమే లక్ష్యంగా కత్తులు నూరుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలోని అసలు సిసలు సమస్యలు ఈసారైనా చర్చకొస్తాయా? లేదా? అన్నది వేచి చూడాలి. ప్రధానంగా ఆరు గ్యారంటీల అమలు నత్తనడకన సాగుతోంది. ఆసరా పింఛన్ల పెంపు, తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.వెయ్యి, ఆటోవాలాలకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం, మహిళా సమాఖ్యల్లోని మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతు భరోసా పెంపు తదితర హామీల అమలు కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) బాగానే అమలవుతున్నప్పటికీ మహిళా ప్రయాణికుల సంఖ్యకు సరిపడా బస్సు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పండగలు, పెండ్లిళ్ల సమయాల్లో బస్సులు లేక, ఉన్నా వాటిలో సీట్లు సరిపోక మహిళలు గొడవలు పడుతున్న ఘటనలు వెలుగు చూశాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటికి వడ్డీలతో ప్రభుత్వ ఆదాయం సరిపోవటంలేదు, అందువల్ల సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతున్నామని సర్కారు చెబుతోంది. వీటన్నింటితోపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ రూ.8.50 లక్షల కోట్ల అప్పులు చేశారని కాంగ్రెస్ వాదిస్తోండగా, తమ హయాంలో కేవలం రూ.2.50 లక్షల కోట్ల రుణాలే తీసుకున్నామంటూ బిఆర్ఎస్ తోసిపుచ్చుతుండటం గమనార్హం.

మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో రూ.13 వేల కోట్ల భారం ఖజానాపై పడింది. ఉపాధి హామీ చట్టాన్ని మార్చిన కేంద్రం, దాని స్థానంలో విబి రామ్ జీ చట్టాన్ని తీసుకొచ్చింది. అందులోని నిబంధనల ప్రకారం మరో రూ.20 వేల కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. మరోవైపు తెలంగాణలోనూ ఎస్ ఐఆర్ ను అమలు చేసి తీరతామంటూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రకటించిన దరిమిలా... దాంతోపాటు విబి జి ఆర్ఎంఎ జి బిల్లును కూడా వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానించనుందని సమాచారం. ఆ తీర్మానాలను కేంద్రానికి పంపనున్నారని స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేడు, రేపు తెలంగాణ 'పద సాహిత్యం'పై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రూసాల సంయుక్త ఆధ్వర్యంలో 'తెలంగాణ పద సాహిత్యం-సమాలోచన' సోమ, మంగళవారాల్లో (ఈనెల 29, 30 తేదీల్లో) జాతీయ సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ మాట్లాడుతూ తెలంగాణ పద సాహిత్యానికి పుట్టినిల్లు వంటిదని, పదాలలో జీవిత తత్వాన్ని ప్రబోధించిన మనిషిని మహోన్నత మార్గంలో నడిపించిందని తెలిపారు. శ్రీకాంత కృష్ణమాచార్యుల నుంచి రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, వేపూరు, మన్నెంకొండ హనుమద్దాసు, దున్న ఇద్దాసు, ఈగ బుచ్చిదాసు, అచలాన్ని ప్రజల ఉద్ధారం నిశ్చయం చేసిన రామదాసు శివరామ దీక్షితులు ఇలా విభిన్న తత్వ సంప్రదాయాలను ఆచరిస్తున్న తెలంగాణ పద సాహిత్యాన్ని సదస్సు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వక్తలు తమ అమూల్యమైన పత్రాలను సమర్పించేందుకు తరలి వస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాహితీ వైభవంలో మణిపూసలుగా అలరారు పదాల గొప్పదనాన్ని ఈ సదస్సు పంచుకోనుందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.కుమార్, గౌరవ అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ వాగ్గేయకారులు, శాసన మండలి సభ్యులు డాక్టర్ గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కీలకోపన్యాసకర్తగా తెలంగాణ పద సాహిత్య పరిశోధకులు డాక్టర్ బి.భాస్కరయోగి, ఆత్మీయ అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.కాశీం తదితరులు పాల్గొంటారని యాభై దాకా పత్ర సమర్పకులు పాల్గొంటారని వివరించారు. తెలంగాణ సాహితీకారులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

'అసెంబ్లీ'కి భారీ బందోబస్తు

- భద్రతపై సిపి సజ్జనార్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా అసెంబ్లీ పరిసరాల్లో నిషేధాజ్ఞలను కూడా విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సారి అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశాలుండటంతో పోలీసు అధికారులు అనేక ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సాయుధ పోలీసులను అడుగడుగునా నియమించడంతో పాటు మెయిన్ గేట్ల నుంచి లోనికి వెళ్లే మార్గాల్లో ప్రతీ వాహనాన్ని సోదా చేసి లోనికి వదిలేలా చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ లాబీ వద్ద కూడా మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తినీ సోదా చేసి వదిలేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. పాస్‌లను ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించాలని, మంత్రులు, శాసనసభ్యుల వెంట పాసులు లేకుండా ఎవరైనా వస్తే వారిని ఆపివేయాలని పోలీసులకు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అసెంబ్లీ వైపునకు వచ్చే చౌరస్తాలలో ముందుజాగ్రత్త చర్యగా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేయడమేగాక ఆందోళనకారులు ఎవరు వచ్చినా నిలువరించడానికి ఇనుప కంచెలను కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు కిలోమీటరు పొడవునా ఎవరు కూడా లాఠీలు, పేలుడు పదార్థాలు తీసుకురావడంతో పాటు గుమిగూడటం వంటి చర్యలకు పాల్పడకుండా నిషేధాజ్ఞలను విధించారు. అసెంబ్లీ భద్రతపై తీసుకున్న చర్యలను నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్.. అధికారులతో ఆదివారం సమీక్ష జరిపారు. కాగా అసెంబ్లీకి నలువైపులా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పని చేస్తున్న తీరును కూడా కమిషనర్ పరిశీలించారు. నగర పోలీసులతో పాటు సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్, టిఎస్ఎస్‌పి, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలను కూడా బందోబస్తుకు వినియోగిస్తున్నారు.

విద్యా ప్రతిష్టతను పెంచాలి

- ప్రభుత్వ విద్యను కాపాడాలి
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సులో రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా ప్రతిష్టతను పెంచుకొని ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క (ధనసరి అనసూర్య) అన్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని మాంగల్య ఫంక్షన్ హాల్ సయ్యద్ జియావుద్దీన్ ప్రాంగణం, రావెళ్ల రాఘవయ్య వేదికలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన ఆ సంఘం రాష్ట్ర విద్యా సదస్సు, రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలు జరిగాయి. అంతకుముందు ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా హైదరాబాదు రోడ్డు సభాస్థలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ విద్యా సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం కోసం భాగస్వాములవుతున్న టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయులు విద్యావిలువలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. అత్యంత విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పించాలన్నారు. విద్యావ్యవస్థ, విజ్ఞాన అభివృద్ధి ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చేదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ విషయంలో టిఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయుల బాధ్యత అధికంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సామాజిక నిర్దేశకులని, మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగిందని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. రోజు రోజుకు అబద్ధాల ప్రచారాలు పెరిగిపోతున్నాయని, ఈ సందర్భంగా నిజాలు మాట్లాడుకోవడానికి ఇలాంటి విద్యా సదస్సులు అవసరమని అన్నారు. తాను పెరిగిన వాతావరణం, పడ్డ బాధలు తనకు తెలుసునని అందుకే ప్రజల మధ్యనే ఉంటానని అన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణతో పాటు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని, పరిష్కారం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సహకారం, భాగస్వామ్యం ఉండాలన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలి : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సదస్సులో రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య నాణ్యత ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ఎందుకు దూరం అవుతున్నారని ఇది ఆలోచించాల్సిన విషయమని అన్నారు., విద్య ద్వారా మాత్రమే సమాజం అభివృద్ధి సాధ్యమని అన్నారు.

దినసరి కూలీలుగా మారే ప్రమాదం : మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రానున్న రోజుల్లో ఉపాధ్యాయ, ఉద్యోగులు దినసరి కూలీగా మారే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం, అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల ఎన్ని చేసినా తమల్ని గెలిపిస్తున్నారనే దానితో అనేక ప్రజావ్యతిరేక విధానాలను కేంద్రం అవలంబిస్తుందని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతో ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉద్యోగ సమస్యల పరిష్కారంలో విజయం సాధిస్తాం
టిజిఇ సేసీ చైర్మెన్ మారం జగదీశ్వర్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వంతో సానుకూల వాతావారణంలో పరిష్కరించుకుంటామని టిజిఇ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.700 కోట్లు ఇవ్వడం వల్ల పెండింగ్ బిల్లుల సత్వరం పరిష్కారం కావడం లేదని అన్నారు. దాని స్థానంలో నెలకు రూ.1500కోట్లు ఇవ్వాలని అలా అయితే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. పిజిఒ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడుతూ టిఎస్ యుటిఎఫ్ క్రమశిక్షణ కలిగిన సంఘం అని అన్నారు. ఈ సదస్సులో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకట్, ఉపాధ్యక్షులు దుర్గ భవాని, జంగయ్య, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, సత్యానంద్, వి. శాంతి కుమార్, శారదా, రంజిత్ కుమార్, బి. రాజు, రవి ప్రసాద్ గౌడ్, రవి కుమార్, శ్రీధర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, వెంకటేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు జయప్రకాష్, హేమలత, శ్రీనివాస రావు, కృష్ణ కందుల శ్రీనివాస్, కృష్ణమూర్తి, వసంత్ నాయక్, తోట వెంకటేశ్వర్లు, యాదవ రెడ్డి, శ్రీహరి, కనకయ్య, ఉప్పలయ్య, రాము, రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

దేశంలో అతి పెద్ద నుమాయిష్

- జనవరి ఒకటిన ప్రారంభం : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మక 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన 2026 నుమాయిష్ వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించనున్నట్టు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్, వ్యాపారం, వినోదం, విజ్ఞానం వంటికి వేదికగా నిలుస్తున్న నుమాయిష్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రారంభిస్తారని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఆదివారం ఎగ్జిబిషన్ మైదానం గాంధీ సెంటనేరీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో బహుళ ప్రాచుర్యం కల్గిన నుమాయిష్ తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10.30 వరకు తెరిచి ఉంటుందని, శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవుల్లో రాత్రి 11 గంటల వరకు ననూమాయిష్ ఉంటుందన్నారు. నూమాయిష్‌ను సందర్శించేందుకు విదేశాల నుంచి వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దీనికోసం 34 సబ్ కమిటీలు ఏర్పాటు ఏర్పాటు చేశామని, వివిధ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తారని అన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రత్యేకంగా 320 మంది వాలంటీర్లను నియమించినట్టు 24 గంటలు అంబులెన్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న 20 ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. 2024-25లో జిఎస్‌టి, ట్రేడ్ లైసెన్సు ఫీజ్, ప్రాపర్టీ యుటిలిటీ ఛార్జీల కింద రూ.10 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చిందని, అలానే 2023-24లో వివిధ పన్నుల రూపంలో చెల్లించినట్టు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఎగ్జిబిషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి, బి.ఎన్, రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ, టి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు, ఆర్ సుఖేష్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎన్. సంజీవ్ కుమార్, ఆదిత్య మార్గం, బి. హనుమంతరావు, ఎన్ వినయ్ కుమార్, పి నరోత్తం రెడ్డి, అశ్విని మార్గం, డాక్టర్ బి ప్రభాస్ శంకర్, ఎం చంద్రశేఖర్, పిఆర్ఒ రవి యాదవ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం మరింత పెరగాలి

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెరిగిందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో విజ్ఞాన దర్శినీ, ది నెహ్రూ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో విజ్ఞాన దర్శినీ రమేశ్ అధ్యక్షతన స్వాతంత్ర్యం నుంచి స్వాలంబన వరకు, శాస్త్రీయ, ఆధునిక భారతదేశం కోసం నెహ్రూ దార్శనీకత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశం ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల్లో మొదటి ప్రధానమంత్రి పండిత జవహర్ లాల్ నెహ్రూ చూపిన దూరదృష్టి నేటి భారతదేశానికి బలమైన పునాదిగా నిలిచిందని తెలిపారు. విద్య, శాస్త్రం, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి ద్వారా స్వావలంబన దిశగా దేశాన్ని నడిపించిన నాయకులు నెహ్రూ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు యువతకు ఇప్పటికీ మార్గదర్శకమని సూచించారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి, తెలంగాణ కన్జూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెస్సల్ కమిషన్ అధ్యక్షురాలు జి.రాధా రాణి మాట్లాడుతూ నెహ్రూ గారు ప్రతిపాదించిన శాస్త్రీయ దృక్పథం ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని తెలిపారు. చట్టం, శాస్త్ర విజ్ఞానం, సామాజిక న్యాయం పరస్పర అనుసంధానంతోనే సమతుల్యమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. నెహ్రూ ఆలోచనలు నేటి తరానికి తర్కబద్ధమైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవడంలో దోహదపడతాయని సూచించారు. మాజీ ఎంపి, ప్రొఫెసర్ సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన, స్వయం సమృద్ధి సాధన, సాంకేతికంగా బలమైన భారత నిర్మాణానికి నెహ్రూ విధానాలు మార్గాలు వేశాయని తెలిపారు. నేటి భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న ప్రగతి స్వాతంత్ర్యం అనంతర కఠిన పరిస్థితుల్లో నెహ్రూతీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాల ఫలితమేనని ఆయన స్పష్టం చేశారు. దేశ అభివృద్ధికి శాస్త్ర విజ్ఞానం, ఆధునిక ఆలోచనలు ఎంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఐఐసిటి రిటైర్డ్ సైంటిస్ట్ లింగయ్య నాగారపు, తెలంగాణ ట్రైకార్ చైర్మెన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్, విజ్ఞాన దర్శినీ తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు బొల్లి ఆదాంరాజ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీ, కోశాధికారి జయప్రసాద్ కడియాల తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో 'ఆగంతకుడు...!?

- 100 కు ఫోన్ చేసినా స్పందన కరువు !
- చూసిన అమ్మాయిలపై వార్డెన్ దాష్టీకం..
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమ్మాయిలకు రక్షణగా ఉండాల్సిన హాస్టల్ గదులు భయానక కేంద్రాలుగా మారుతున్నాయి. విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాల్సిన చోట ఆగంతకుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ బాలికల హాస్టల్‌లో జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.జయశంకర్ - భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఓ బాలికల హాస్టల్ లోకి కొన్ని రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఒక ఆగంతకుడు హాస్టల్ ఆవరణలోకి ప్రవేశించాడు. అతను నేరుగా ఒక గదిలోకి వెళ్లడం గమనించిన అమ్మాయిలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే అసలు ఆ ఆగంతకుడు ఎవరు? వార్డెన్ ఉన్నా లోపలికి ఎలా రాగలిగాడు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అమ్మాయిలు డయల్ 100కు సమాచారం ఇచ్చినా.. హాస్టల్ వద్దకు వచ్చిన ఇద్దరు పోలీసులు, కనీసం ఎవరిని విచారణ చేయకుండానే బయట నుండే వెనుదిరగడం ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఆగంతకుడిని కాపాడేందుకు ఓ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రంగంలోకి దిగి,. అక్కడికి వచ్చిన పోలీసులకు ముడుపులు చెల్లించి, తప్పుదోవ పట్టించి వెనక్కి పంపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత ఆగంతకుడిని తమ వెంట కారులో ఎక్కించుకొని తీసుకెళ్లినట్టు సమాచారం.

చూసిన విద్యార్థినీలపై వార్డెన్ దాష్టీకం...

ఆగంతకుడి రాకను గమనించి, గదిలోకి వెళ్లడం చూసి పోలీసులకు సమాచారం అందించిన అమ్మాయిలను టార్గెట్ చేసిన వార్డెన్ 'ఈ విషయం బయటకు చెబితే మీ పనిఅంతే'అంటూ కొడుతూ, చిత్రహింసలకు గురిచేస్తూ భయభ్రాంతులకు గురిచేసినట్టు సమాచారం. వార్డెన్ ప్రవర్తన చూస్తుంటే ఆ ఆగంతకుడికి సహకరిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉండి నిత్యం జనసంచారం సంచరించే ప్రాంతంలో ఉన్న ఆ హాస్టల్‌లో ఇంత తతంగం జరుగుతున్నా పోలీసులు కూడా మౌనంగా ఉండటం ఏంటనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. 100కు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని తెలుస్తోంది. దీంతో హాస్టల్‌లో ఉంటున్న అమ్మాయిలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి పూర్తి విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నవంబర్ నాటికి రూ.19,314 కోట్ల ఆదాయం

- పెరిగిన సరుకు రవాణా, ప్రయాణికుల ఆదాయం
- దక్షిణ మధ్య రైల్వే విజయాల పరంపర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే 2025లో స్థిరమైన విజయాలను నమోదు చేసుకుంది. గతేడాది జనవరి నుంచి నవంబర్ నాటికి మొత్తం ఆదాయం రూ.18,831 కోట్లు అయితే, ఈ ఏడాది అదే సమయంలో రూ.19,314 సంపాదించింది. గతేడాది 128.4 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేస్తే, ఈ ఏడాది 136.2 మిలియన్ టన్నులు, ప్రయాణికుల ఆదాయంలో రూ.5,261 కోట్ల నుంచి రూ.5,525 కోట్లకు పెరిగింది. 68 మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించారు. 22 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, 60 రోడ్ అండర్ బ్రిడ్జీలు నిర్మించారు. 199 కిలో మీటర్ల ట్రాక్‌ను జోడించారు. 184 కిలోమీటర్ల పొడువును విద్యుదీకరించారు. 529 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌ను ప్రారంభించారు. నాలుగు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను కైవసం చేసుకుంది. రాయచూర్, కాచిగూడ, లింగంపల్లి రైల్వే స్టేషన్లకు మెరిట్ సర్టిఫికెట్స్ దక్కాయి.

2025లో హైదరాబాద్ టెర్మినళ్లలో రద్దీని తగ్గించేందుకు చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌ను ప్రారంభించారు. రైల్వే అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్టుల మొదటి వార్షిక సదస్సును నిర్వహించారు. లాలాగూడ సెంట్రల్ ఆస్పత్రి 64 స్లైసెస్ సిటీ స్కాన్ యంత్రాన్, అంతర్గత కార్డియాక్ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేశారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌ను వాస్తుశిల్ప సుందరీకరణతో విద్యుత్ దీపాలంకరణ చేశారు. కాచిగూడ-భగత్‌కీ కోటి మధ్య నూతనంగా రోజు వారీ రైలును అందుబాటులోకి తెచ్చారు. పెద్దపల్లి వద్ద బైపాస్ లైన్ ప్రారంభించారు. సీఎస్ టీఎం-జాల్నా మధ్య నడుస్తున్న వందే భారత్ రైలును నాందేడ్ వరకు పొడిగించారు. తిరుపతి-సాయినగర్ షిర్డీ మధ్య నూతన వీక్లీ రైలుతో పాటు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించినట్టు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టివివిపి ఉద్యోగుల కల నెరవేరేనా?

- అసెంబ్లీలో బిల్లు కోసం ఎదురుచూపులు
- క్యాడర్ స్ట్రెంత్ తగ్గించొద్దని కాంట్రాక్టు ఉద్యోగుల వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ మూడు దశాబ్దాల కలను కాంగ్రెస్ సర్కారు నెరవేర్చుతుందనే కొండంత ఆశతో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులు ఎదురుచూసున్నారు. చిన్నచిన్న సమస్యలున్నా ఆస్కి రిపోర్టు సానుకూలంగా రావడంతో టివివిపిని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చే ప్రక్రియకు మార్గం సుగమం అయిందని భావిస్తున్నారు. హెల్త్‌కార్డులు, 010 ద్వారా వేతనాల చెల్లింపు కల నెరబోతుందనే భరోసాతో ఉన్నారు. టివివిపిపై విస్తృతంగా చర్చ నడుస్తున్నప్పటికీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చే అంశానికి సంబంధించిన కీలక ఫైలు వైద్యారోగ్య శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆ ఫైలును క్లియర్ చేస్తుందా? క్యాబినెట్‌లో చర్చించి ఈ అసెంబ్లీ సమావేశాల్లో దానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెడ్తుందా? టివివిపి ఉద్యోగుల కల నెరవేరుతుందా? కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా దాన్ని నాన్చుతుందా? అనే దాన్ని మునుముందు చూడాల్సిందే.

స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా వైద్య విధాన పరిషత్ 1986లో ఏర్పడింది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని 30, 50, 100 పడకల ప్రభుత్వ వైద్యశాలలు, జిల్లా వైద్యశాలలను దాని పరిధిలో అప్పటి పాలకులు చేర్చారు. దాని పరిధిలో పనిచేసేవారు సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రమోషన్, పెన్షన్, కారుణ్య నియామకాలను అప్పట్లో కోల్పోయారు. పోరాటాల ఫలితంగా వాటిలో కొన్ని తిరిగి పొందారు. ప్రస్తుతం తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఇలా 12 వేల మంది దాకా పనిచేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం ద్వారా నియమించబడినవారే. ఐదున్నర వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. వారంతా జీతాలను గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు ఈ పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జెఎసి డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని అధ్యయనం కోసం 2022లో ఒక కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. ఎన్నికలు రావడంతో వారి సమస్య పరిష్కారం కాలేదు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందనే భరోసాతో మంత్రి దామోదర రాజనర్సింహకు జెఎసి నాయకులు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. ఆయన కూడా వైద్య విధాన పరిషత్ రద్దుకు సానుకూలత వ్యక్తం చేస్తూ ఈ విషయంపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీ వేశారు. విస్తృత అధ్యయనం తర్వాత, వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటుకు అనుకూలత వ్యక్తం చేస్తూ నివేదికను అందజేసింది. అయితే, సిబ్బందిని తగ్గించాలనే మెలిక పెట్టింది. దీంతో నేటికీ సమస్య కొలిక్కి రాలేదు. టీవీవీపీని వైద్యారోగ్యశాఖలో పూర్తిగా విలీనం చేయాలనే డిమాండ్‌తో వైద్యులకు, నర్సింగ్ ఆఫీసర్లకు, ఇతర సిబ్బందికి సంబంధించిన వివిధ సంఘాల క్యాడర్ల బాధ్యులు ఏకమై వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల ఐక్యవేదిక ఏర్పాటు చేసుకొని వివిధ కార్యక్రమాలు చేస్తున్నారు ఈసారైనా అసెంబ్లీలో వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు పొందేలా బిల్లు ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడదనే విషయాన్నీ, టివివిపికి మాతృసంస్థ అయిన ఎపివివిపిని ఆంధ్రప్రదేశ్‌లో రద్దు చేసిన విషయాన్ని బలంగా ఎత్తిచూపుతున్నారు. అధికార వర్గాల సమాచారం మేరకు క్యాబినెట్ ముందు ఈ ప్రతిపాదనను ఉంచడానికి అవసరమైన కసరత్తు అంతా ఇప్పటికే పూర్తయిందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆచరణలో ఎంత మేరకు పట్టాలెక్కుతుందనే విషయాన్ని చూడాలి. అందుకే అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల సంఘం డిమాండ్ చేస్తున్నది.

ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులివే..

వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వారికి 010 కింద వేతనాలు అందట్లేదు. అదే సమయంలో ప్రభుత్వం నుంచి పొందే ఆర్థిక ప్రయోజనాల విషయంలో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. అందరికీ వైద్యం అందించే వారికి అనారోగ్య సమస్యలు వస్తే చూపించుకోవడానికి హెల్త్‌కార్డులు లేకపోవడం దారుణమైన విషయం. ఆయా శాఖల పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగులను బిఆర్ఎస్ ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. వైద్య విధాన పరిషత్ పరిధిలోని వారిని మాత్రం విస్మరించింది. పర్మినెంట్ కోసం వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనం కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కొన్ని వారికి వర్తించడం లేదు. వాటి అమలు కోసం మళ్లీ సచివాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి. డిఎమ్ఇ, డిహెచ్ పరిధిలో పనిచేసే సిబ్బందికి ఇన్ సర్వీస్ ట్రైనింగ్ అవకాశముంది. వైద్య విధాన పరిషత్‌లో పనిచేసేవారికి ఆ సౌకర్యం లేకుండా పోయింది. వైద్య శాఖలో విలువైన సేవలందిస్తున్నప్పటికీ హెచ్ఒడి గుర్తింపు లేదు. పీఆర్సీ కమిటీకి ప్రతిపాదనలు అందించలేని పరిస్థితి.

రెగ్యులర్ చేయాలి : బైరపాక శ్రీనివాస్,

తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ వైద్య విధాన పరిషత్ విభాగం రాష్ట్ర కార్యదర్శివైద్య విధాన పరిషత్ లో దాదాపు 20 ఏండ్ల నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సేవలందిస్తున్న వారందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలి. టివివిపిని సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా అప్‌గ్రేడ్ చేస్తుండటం శుభపరిణామం. అయితే ఆస్కి నివేదికలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అదే హోదాలో రిటైరయ్యేలా సిఫారసు చేయడం ఆందోళనకరం. క్యాడర్ స్ట్రెంత్‌ను తగ్గించొద్దు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ ప్రకారం ఆయా క్యాడర్ల స్ట్రెంత్‌ను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. 010 కింద వేతనాలు చెల్లించాలి. అందర్నీ రెగ్యులర్ చేయాలి.

'పాలమూరు'పై బిఆర్ఎస్ పచ్చి అబద్ధాలు

- బడ్జెట్‌లో సగం ఖర్చు చేయకుండా 90 శాతం పనులు ఎలా సాధ్యం
- రెండేళ్లలో పెద్దపీట వేస్తే... పనులు ఎందుకు పూర్తి కాలేదు
- భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి : జాన్‌వెస్లీ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకోసం ఖర్చు చేయాల్సిన రూ.74 వేల కోట్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కేవలం రూ. 32 వేల కోట్లు ఖర్చు చేసి 90 పనులు పూర్తి చేశామని మాజీ సిఎం కెసిఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో పాలమూరు రంగారెడ్డికి పెద్దపీట వేశామని చెప్పడం హస్యాస్పదంగా ఉంది. పెద్ద పీట వేస్తే ప్రాజెక్టు పనులు ఎందుకు పూర్తి కాలేదు. ఇరు పార్టీల నాయకులు పాలమూరు ప్రాజెక్టుల విషయంలో దాట వేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలమూరు బీడు భూములకు సాగునీరు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలి. అశాస్త్రీయ పద్ధతిలో మాట్లాడటం సరికాదు. పారదర్శకతతో పనులు పూర్తి చేయకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన డిస్ట్రిబ్యూటర్లు, చిన్న కాల్వలు మొదలే కాలేదని, ప్రధాన కాల్వలే పూర్తి చేయకుండా బీళ్లకు నీళ్ల ఎలా పారుతాయని ప్రశ్నించారు. నిర్దిష్టమైన సమయం పెట్టుకొని ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పాలమూరు వంటి వలసల జిల్లా ఆకలని తీర్చే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేందుకు బిల్లును తెచ్చిందన్నారు. ఈ బిల్లు ద్వారా చేసిన పనులకు 40 శాతం నిధులు పంచాయితీలే భరించేలా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కార్మికులను అభద్రతకు గురిచేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు.

రైతుల భూములను కార్పోరేట్లకు అప్పగించేందుకు బిజెపి కుట్ర చేస్తోందన్నారు. కేంద్రం వెంటనే నిధులు పెంచి గ్రామ పంచాయితీల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ విషయంలో ప్రభుత్వం పాత విధానాలను అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. అసెంబ్లీ సమా వేశాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో చర్చలకే పరిమితం కాకుండా కేంద్రంపై పోరాటాలకు సిఎం రేవంత్ అఖిలపక్షాన్ని పిలవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ. రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, కురుమూర్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికే అక్రిడిటేషన్లు ఇవ్వాలి

- రూప్‌సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు ఇవ్వాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జీవో 252ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆ జీవోకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమానమైన హక్కులున్నప్పుడు రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులంటూ రెండు రకాల పేర్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆరోగ్య కార్డులకు నిధులివ్వకుండా వేధిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మీడియాను రెండుగా చీల్చాలని కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీచైతన్య ఉద్యోగుల స్పోర్ట్స్ ఉత్సవ్ విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీచైతన్య ఉద్యోగుల స్పోర్ట్స్ ఉత్సవ్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లోని అన్నీ బ్రాంచీలలోని వేలాదిమంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది 12 జోన్లుగా వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహించారు. అథ్లెటిక్స్, ఇండోర్-అవుట్‌డోర్ గేమ్స్, రిక్రియేషనల్ అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. సిబ్బందిలో పోటీతత్వం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను వెలికితీసే ఈ క్రీడా వేడుక అందరి ప్రశంసలను అందుకుంది.

ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో క్రికెట్, వాలీబాల్, టెబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్, పికెట్ బాల్ వంటి విభాగాలలో రాణించిన విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, డైరెక్టర్లు శ్రీధర్, టి నాగేంద్ర కుమార్ హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ బోర్డ్ పరీక్షలతో పాటు ఐఐటిజెఇఇ, నీట్, ఒలింపియాడ్‌లో ఆలిండియా అగ్రగామిగా ఉన్న శ్రీచైతన్యలో విద్యతో పాటు శారీరక వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామనీ, క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఓర్పు వంటి జీవితంలో అత్యవసరమైన విలువలను విద్యార్థులు నేర్చుకుంటారని, ఇందుకు స్ఫూర్తిగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఈ క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ పోటీలు ప్రతి సంవత్సరం కొనసాగుతాయని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అంతటా విద్యార్థుల మానసిక, శారీరకాభివృద్ధికి అత్యుత్తతమ వాతావరణాన్ని అందించేందుకు శ్రీచైతన్య ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆమె వివరించారు. విద్యార్థులు విద్యలోనూ, క్రీడల్లోనూ, జీవితంలోనూ విజేతలుగా ఎదగాలనే ప్రేరణతో ముందుకు సాగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం ఇంతగా విజయవంతం అవ్వటానికి కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్లు

విబి జి ఆర్ఎంఎం జి ను వెంటనే రద్దు చేయాలి

- ఈ బిల్లు వికలాంగుల జీవనోపాధి హక్కుపై దే
- ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో బిల్లు ప్రతుల దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్రాలను దహనం చేస్తున్న 'వికలాంగుల' కమిటీ నాయకులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వికసిత్ భారత్ - రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025 (విబి జి ఆర్ఎంఎం జి) వికలాంగుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనిని రద్దు చేసేవరకు ఉద్యమం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య అన్నారు. ఆదివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి ఎక్స్ రోడ్డు వద్ద విబి జి ఆర్ఎంఎం జి చట్టం పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని వికలాంగులకు ఉపాధి హామీ చట్టం ద్వారా 150 రోజులు కల్పించేందుకు ఈ చట్టం వచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,38,088 మంది వికలాంగులకు ఈ చట్టం కింద ఉపాధి కల్పించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన బిల్లు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. కొత్త బిల్లుతో వికలాంగులకు పని దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వికలాంగుల జీవనోపాధి, గౌరవం, మనుగడకు ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగులకు అందుబాటులో ఉండే పని కూడా దొరికే అవకాశం లేదన్నారు. వికలాంగుల జీవనోపాధిని దెబ్బతీసేలా ఉన్న వీబీ జీ రామ్ జీ బిల్లు పత్రాలను ఈ నెల 30, 31తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు ఉపేందర్, కాషాప్ప, మధుబాబు, అరిఫా, సహాయ కార్యదర్శులు జెర్కొని రాజు, నాగలక్ష్మి,బాలిశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కవిత, బాలయ్య, భుజంగారెడ్డి, చంద్రమోహన్, చందు, భాగ్యలక్ష్మి, షైన్ బేగం, ప్రకాష్, లలిత, దుర్గ, కుర్మయ్య, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను మరిచిన రేవంత్‌రెడ్డి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డిపై పగ బట్టారు. కాళేశ్వరంపై కక్ష బూనారు. ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్‌ను స్థానిక ఎన్నికలలో ఖండించారు. వచ్చే ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి భీమవరం బుల్లబ్బాయి రేవంత్‌రెడ్డిని అడ్రస్ గల్లంతు చేయాలి' అని మాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుబంధు పోయిన రాబందుల పాలన వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం వ్యవసాయ పనులు వదలి రోజుల కొద్ది అధికారుల చుట్టూ తిరిగేరోజుల వచ్చాయన్నారు. 145 మెగావాట్లతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పంపులు బిగించి ఒక మోటారు కేసీఆర్ ప్రారంభించారని 90 శాతం పనులు పూర్తి అయిన ప్రాజెక్టును రెండేండ్లలో పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. స్థానిక విజయాలు చూస్తుంటే 2028లో జరిగే శాసన సభ ఎన్నికలో కేసీఆర్ విజయం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. అమెరికాలో బాత్రూములు కడిగావని విమర్శలు చేస్తున్న రేవంత్‌కు నా బాత్‌రూములు నేను కడిగితే నీకు ఏమి కష్టమని ప్రశ్నించారు. గెలిచిన సర్పంచులకు భారత రాజ్యాంగమే రక్షణగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మట్టి కరిపించాల్సిన సమయం ఆసన్నం అయ్యిందన్నారు.

త్రిబుల్ ఆర్ రైతుల కోసం పోరాడుతా

- జాగృతి అధ్యక్షులు కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిబుల్ ఆర్ రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని తెలంగాణా జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి కడ్తాల్ మండలం సాలార్‌పూర్‌లో బస చేసిన కవిత ఆదివారం ఉదయం ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని గుర్రగుట్ట కాలనీలో పర్యటించారు. కాలనీ సమీపంలో ఇండ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఆమె పరిశీలించారు. అలాగే తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలోని త్రిబుల్ ఆర్‌లో భూమిని కోల్పోతున్న రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిహారం కాదు తమ భూములు తమకు కావాలని రైతులు అడిగితే అధికారులు స్పందించడం లేదన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆమగనల్‌లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను నివాసాలకు దూరంగా తరలించాలని స్థానిక ఎమ్మెల్యేకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, మాజీ ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలంగౌడ్, జంగారెడ్డిపల్లి సర్పంచ్ పసుల మల్లేష్, గడ్డమీది తండా మాజీ సర్పంచ్ ఈశ్వర్‌నాయక్, ఉపసర్పంచ్ మంజుల వెంకట్‌రెడ్డి, వార్డ్ సభ్యులు శేఖర్‌గౌడ్, రజిత రమేష్, పావని కృష్ణయ్య, లక్ష్మమ్మ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

హాట్‌హాట్‌గా పాలమూరు రంగారెడ్డి

- అధికార, ప్రధాన ప్రతిపక్షపార్టీల రాజకీయ విమర్శలు
- మా హయాంలో సగం చేశామని బిఆర్ఎస్..
- ఏమి చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నేతల ప్రశ్నలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఇప్పుడు రాజకీయ వేదికగా మారింది. దీనిచుట్టూ ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. మూడేళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు పనులను అధికారంలో ఉన్నన్నిరోజులు పూర్తి చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని అధికార పార్టీ అంటుంటే,.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా.. తట్టెడు మట్టి తీయలేదని బిఆర్ఎస్ పార్టీ అంటోంది. నిన్నటి మొన్నటి దాకా ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కెసిఆర్, కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య హాట్‌హాట్‌గా మాటల యుద్ధం నడిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభం అయ్యే అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు ప్రాజెక్టు, కృష్ణా జలాలే ప్రధాన ఎజెండా కాబోతుంది.

2015 జూన్ 11న ఆనాటి సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వేనా దగ్గర పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడేండ్లలో పూర్తి చేసి 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇస్తామని ఆనాడు కెసిఆర్ ప్రకటించారు. అన్నేళ్లు అధికారంలో ఉండి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయలేదన్న విమర్శలను కెసిఆర్ ప్రభుత్వం మూటకట్టుకుంది. చిన్న కాల్వలు తవ్వలేదు. ప్రధాన కాల్వలు కూడా అసంపూర్ణంగానే మిగిలి ఉన్నాయి. నాటి బిఆర్ఎస్ అయినా నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలైనా ప్రాజెక్టు పూర్తి చేయడానికి చిత్త శుద్ధి కనబరచడం లేదని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

వీటిని పూర్తి చేసేదెప్పుడు...

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్ నుంచి రిజర్వాయర్లు నింపే ఓపెన్ కెనాల్ పనులు పూర్తి కాలేదు. మొదటి రిజర్వాయరు నార్లాపూర్ నుండి 16 కిలోమీటర్ల టన్నెల్, 8.3 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ పూర్తి చేయాల్సి ఉంది. ఓపెన్ కెనాల్ ఇంకా 2.50 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. 15 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వాల్సింది. లింకు కెనాల్ తీయకుండా ఉద్దండాపూర్ వరకు ఐదు రిజర్వాయర్లు నింపి సాగు నీరు అందడం కష్టం. ముంపుకు గురైన సాగు భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు రెండేండ్లపాటు ఆందోళనలు చేశారు. రైతులు కోర్టుకు పోయారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వేనా, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు నిండాలంటే ముందు కుడికిళ్ల దగ్గర ప్రధాన కాల్వ పూర్తి చేయాల్సింది.

ప్రధాన కాల్వల పనులు పూర్తి చేయాలి

పాలమూరు రంగారెడ్డి నిర్దేశిత 12.30 లక్షల ఎకరాల లక్ష్యం నెరవేరాలంటే ప్రధాన కాల్వలతో పాటు ప్రధాన కాల్వలు డిస్ట్రిబ్యూటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు చిన్న కాల్వల ఊసే లేదు. ప్రధాన రిజర్వాయర్ల నుంచి మెయిన్ కాల్వల ద్వారా చిన్న కాల్వలు నిర్మించకుంటే వంద శాతం సాగు భూములకు నీరు అందడం కష్టమే. పదేళ్లయినా.. సాగు నీటి సరఫరాకు అవసరమైన చిన్న కాల్వలను తీయడానికి పాలకులు చర్యలు మొదలు పెట్టలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రధాన కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటర్లపై దీష్టి పెట్టాలి. ప్రధాన కాల్వలు సైతం త్వరితగతిన పూర్తిచేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

లెక్కలు ఘనం అమలు శూన్యం

పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ లెక్కలు ఘనంగా ఉన్నాయి. అమలు మాత్రం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 90 టీఎంసీలతో12.30 లక్షల ఎకరా లకు సాగునీరు అందుతోంది. మరో 7.15 టిఎంసిల నీరు తాగునీటికి ఉపయోగపడుతోంది. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాథమికంగా 35,200 కోట్లు ఖరారు చేశారు. తర్వాత 74వేల కోట్లకు అంచనాలకు పెంచారు. భూసేకరణ 27,047 ఎకరాలు కాగ ఇంకా 1750 ఎకరాలను సేకరి ంచాల్సింది.

లిఫ్టులు ఇలా

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో ఐదు రిజర్వాయర్లు నిర్మాణం అవుతున్నాయి. మొదటి లిఫ్టు నార్లాపూర్ దగ్గర తొమ్మిది మోటార్లు కాగా ఇప్పటి వరకు నాలుగు మోటార్లను సిద్ధం చేశారు. ఈ రిజర్వాయరు సామర్థ్యం 8.61 టిఎంసిలు కాగా రిజర్వాయరు పనులు పూర్తయినా..ఐదు మోటార్లను బిగించాల్సి ఉంది.ఏదుల రిజర్వాయరులో 10 మోటార్లకు గాను ఐదు సిద్ధం అయ్యాయి. ఇంకా ఐదు బిగించాల్సి ఉంది. 95 శాతం పనులు జరగాల్సి ఉంది. మూడో లిఫ్టు వట్టెం దగ్గర పది మోటార్లకు గాను ఐదు సిద్ధం అయ్యాయి. 16.58 టిఎంసిల సామర్థ్యం కల్గిన రిజర్వాయరు పనులు 90 శాతం పూర్తయ్యాయి. కురుమూర్తి రాయ లిఫ్టు 19.5 టిఎంసిలు 80 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ గ్రావిటీ ద్వారా నీటిని ఉద్దండాపూర్ వస్తాయి. ఉద్దండపూర్‌లో ఆరు మోటార్లకుగాను మూడు బిగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.19.91 టిఎంసిలు కాగా 70 శాతం పనులు పూర్తయ్యాయి.

మొండి కేసిన డిండి పనులు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా వనపర్తి జిల్లా ఏదుల దగ్గర ఉండే రిజర్వాయరు నుంచి డిండి ద్వారా నల్లగొండ జిల్లాకు సాగునీరు ఇచ్చే డిండి ఎత్తిపోతల పనులు మొండికేశాయి. ముఖ్యంగా చారగొండ మండలం ఎర్రవెల్లి గోకారం రైతుల భూములు ముంచొద్దంటూ... రైతులు గత రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం నుండి సానుకూల ప్రకటన వచ్చే దాక పనులు చేయకుండా అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో సాగునీటిపై ఆధార పడి 16 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఆయకట్టుకు సాగు నీరు అందాలంటే పాలమూరు ప్రాజెక్టులతో పాటు కొడంగల్, నారా యణపేట ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయడం ద్వారా ఈ జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశాలు ఉన్నాయి.

నిధులు ఇలా

పాలమూరు ప్రాజెక్టులకు నిధులు అత్యల్పంగా కేటాయించారు. కేటాయించిన నిధులు సైతం పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. కోయిల్‌సాగర్‌కు 80.75 కోట్లు నిధులు కేటాయించి కేవలం 33 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. భీమాకు 631.23 కోట్లు కేటాయిస్తే.. 63 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నెట్టెంపాడు ప్రాజెక్టు కోసం 144 కేటాయించి 47 కోట్లు ఖర్చు చేశారు. కల్వకుర్తికి 800 కోట్లు ఖర్చు చేసి 80 కోట్లు, డిండికి 433 కోట్లు కేటాయించి 133 కోట్లు, ఎస్ఎల్‌బీసీకి 889 కోట్లు కేటాయించి కేవలం 108 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కేటాయించిన నిధులు చేసిన ఖర్చులు చూస్తే పాలమూరు ప్రాజెక్టులపై ఎంత ప్రేమ ఉందో మనకు అర్థం అవుతుంది. పాలమూరు రంగారెడ్డి 1285 కోట్లు ఖర్చు చేసి కేవలం 500ల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పనులు శరవేగంగా పూర్తి చేసి బీడు భూములకు నీరు అందేలా చూడాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

తెలుగు వారు తమ మూలాలను మరవొద్దు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - కల్చరల్

అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆటా వేడుకలు-2025 గ్రాండ్ ఫినాలే' రవీంద్రభారతిలో శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషకు, సంస్కృతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువస్తున్న ఆటా సేవలను ఆయన కొనియాడారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారు తమ మూలాలను మరవకుండా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తరతరాలకు అందించడం అభినందనీయమన్నారు. ఆటా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, విద్యా, వైద్య, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. అనంతరం గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఆటా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'ఆటా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ దర్శకులు ఏ. కోదండరాం రెడ్డికి గవర్నర్ అందజేశారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, అనేక విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారని వక్తలు ప్రశంసించారు. ఆటా జీవిత సాఫల్య అవార్డును అందుకోవడం తన జీవితంలో గర్వకారణమని కోదండరాం రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు నరసింహారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొని ఆటా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, ప్రెసిడెంట్ ఎలెక్ట్ సతీష్ రామసహాయం రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ కొమిటి రెడ్డి, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ, కో-చైర్ నరసింహ ద్యాసాని, సాయి సుధిని, ట్రెజరర్ శ్రీకాంత్ గుడిపాటి, క్రీడల సమన్వయకర్త విజయ్ గోలి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పెత్తందార్ల పార్టీ కాంగ్రెస్ పేదల పార్టీ

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి పెత్తందార్ల పార్టీ అయితే కాంగ్రెస్ పేదల పార్టీ అని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్‌లో ఉన్న నాయ కులు, కార్యకర్తలు అదృష్టవంతులన్నారు. ఆదివారం గాంధీభవన్ లో నిర్వహించిన డిసిసి అధ్యక్షులు ఎం.రోహిత్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారాన్ని కాపాడుకోవడానికి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేస్తున్నదని ఆయన విమర్శించారు. పేదల సొమ్మును కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తొలగించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. బిజెపి విధానాలను ఎండగడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ యాదవ్, మాజీ ఎంపి వి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జనార్ధన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం : మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఆదివారం పిజెఆర్ 18వ వర్ధంతి సందర్భంగా ఆయన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ చౌరస్తాలో పిజెఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు దోపిడీకి వ్యతిరేకంగా పీజేఆర్ చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విబి జి ఆర్ఎంఎం జి బిల్లును వెనక్కి తీసుకోవాలి
మంత్రులు పొన్నం, వివేక్, అజహరుద్దీన్

విబి జి ఆర్ఎంఎం జి బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజహరుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. స్వాతంత్ర్యాన్ని సాధించడంలోనూ, దేశాన్ని అభివృద్ధిలో నడపడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని తెలిపారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, యుపీఏ ప్రభుత్వాలు తెచ్చిన సంస్కరణలతోనే భారతదేశం ప్రపంచంలో ముందుందని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉపయోగపడిందని గుర్తుచేశారు. 2014 ఎన్నికల ఎజెండాలో బిజెపి ఈ చట్టాన్ని పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. కేంద్రం పూర్తి వాటా భరించే దీంట్లో రాష్ట్రాలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంస్కృతి పరిరక్షణతో మానవీయ విలువలకు రక్షణ

- పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్

ప్రజాశక్తి - కల్చరల్

నేడు సమాజంలో స్వార్థం ధనిక స్వామ్యం విదేశీ నాగరికత వ్యామోహం ప్రబలంగా ఉన్నాయని పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు సంస్కృతీ పరిరక్షణ తోనే మానవీయ విలువలకి రక్షణ అని ఆయన చెప్పారు లకడి కా పూల్ వద్ద నున్న ఒక హెూటల్ లో అక్షజ్ఞ ప్రచురణ సంస్థ దశాబ్ది వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సాంస్కతిక సాంస్కృతిక సంస్థ ల నిర్వాహకులు రాసమయి డాక్టర్ ఎం కె రాము, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు కిన్నెర ఆర్ట్స్ రఘు రామ్, యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ, సత్కలా భారతి సత్య నారాయణ సంగమం అకాడమీ సంజయ కిశోర్ శిఖరం ఆర్ట్స్ కృష్ణలకు కళల ప్రచారకులుగా సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈటెల రాజేందర్ వారిని సత్కరించి మాట్లాడారు సాంకేతిక పరిజ్ఞానం వల్ల మంచి ఉన్నా సమాజంలో చెడు కూడా జరుగుతోంది అన్నారు ప్రతి ఒక్కరూ ఒత్తిడి ఆందోళనతో రోజులు గడుపుతున్నారని చెప్పారు. దీనికి కారణం మంచి బోధించే కళా ప్రక్రియలు ప్రాధాన్యత కోల్పోతూ వుండడమే అన్నారు. మరల పాత సంస్కృతీ వైభవం తప్పక వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ సత్కార గ్రహీతలు సాంస్కృతిక రంగ సేవకులు అని అభివర్ణించారు ఈ సందర్భంగా అక్షజ్ఞ ప్రచురణ సంస్థ ప్రచురించిన సంపుటిలు ఎందరో మహానుభావులు, పురాణ కథా మతం,భలే శాస్త్రీ, న్యాయ పద్గం, వివాహ వైభవం, వ్రజ మోహనలను డాక్టర్ రమణతో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన సభ సభ్యులు మండలి బుధ ప్రసాద్ నాట్య గురువు పసుమర్తి రామ లింగ శాస్త్రి ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంత లక్ష్మీ ఆవిష్కరించారు. సాంస్కృతిక అభిమాని సారిపల్లి కొండల రావు తదితరులు సభలో పాల్గొనగా ప్రచురణ సంస్థ వెంకట్ విద్యా భార్గవి కార్యక్రమం నిర్వహించారు.